సాక్షి ప్రకాశం

శుక్రవారం । 13 । జనవరి । 2023



అట్రాసిటీ కేసుల్లో అలసత్వం వద్దు

ఎస్సీ, ఎస్టీ కేసుల దర్యాప్తులో అలసత్వం వద్దని ఎస్పీ మలికా గర్గ్ సూచించారు.

- IIలో..



అపార్ట్‌మెంట్‌లో విషాదం

పర్చూరు: మెట్ల ల్యాండింగ్ బల్ల కూలి పోవడంతో ఇద్దరు మహిళలు మృతి చెందిన సంఘటన గురువారం పర్చూరులో జరిగింది.

- IIలో..

గరిష్టం/కనిష్టం 31 /20

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. తెల్లవారు ఝామున నుంచి చల్లని గాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

వణుకుతున్న తీరం

● తీరప్రాంత గ్రామాల్లో పెరిగిన 'చలి గాలులు'

కొత్తపట్నం: తీరప్రాంత గ్రామాల్లో చలిగాలలు తీవ్రరూపం దాల్చాయి. వారం రోజులుగా చలిగాలులు పెరిగిపోవడంతో ప్రజలు వణికిపోతున్నారు. చలిగాలులకు ఉదయం 9 గంటలకు కూడా ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి. సముద్ర గాలులకు చలి గాలి తోడవంతో ప్రజలు ఇక్కట్లు పడుతున్నారు. వేకువజామునే పనుల నిమిత్తం వెళ్లే వారు ఇబ్బందులు చెప్పేవీ కావు. చలి గాలుల దెబ్బకు పశువులు, గొర్రెలు, మేకలు సైతం వ్యాధులకు గురవుతున్నాయి. సంక్రాంతి వరకు ఈ చలి గాలుల తీవ్రత తప్పేలా లేదు.

15 నుంచి జాతీయ స్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు

ఒంగోలు రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా ప్రకాశం జిల్లా కబడ్డీ అసోసియేషన్, ఎన్‌టీఆర్ క్రీడా పరిషత్ ఆధ్వర్యంలో కరవదిలో ఈ నెల 15, 16, 17 తేదీల్లో జాతీయస్థాయి మహిళా బీచ్ కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. దివంగత ముప్పిరి కిషోర్‌బాబు, అంజమ్మ క్రీడా ప్రాంగణంలో ఆదివారం సాయంత్రం పోటీలు ప్రారంభమవుతాయన్నారు. జాతీయ మాజీ కబడ్డీ క్రీడాకారుడు, కరవది ఎన్‌టీఆర్ క్రీడా పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు శిరిగిరి రంగారావు అధ్యక్షతన ఏపీ హైకోర్టు జస్టిస్ కె.మన్మథరావు పోటీలను ప్రారంభిస్తారన్నారు. విశిష్ట అతిథులుగా ఏపీ హైకోర్టు రిజిష్ట్రార్ ఏ గిరిధర్, జిల్లా ప్రిన్సిపల్ సివిల్ అండ్ సెషన్స్ జడ్జి ఏ భారతి, గుంటూరు జిల్లా సివిల్ అండ్ సెషన్స్ జడ్జి జి.రాంగోపాల్ పాల్గొంటారని తెలిపారు.

జాతీయ రెఫరీగా నజీర్

● వెయిట్ లిఫ్టింగ్‌లో మూడు పతకాలు



నజీర్‌ను సన్మానిస్తున్న ఇస్మాయిల్, సుభానీ

మార్కాపురం: మార్కాపురం పట్టణానికి చెందిన షేక్ నజీర్ అహ్మద్ వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ రెఫరీగా ఎన్నికయ్యాడు. రెండు రోజుల క్రితం విశాఖపట్నంలో జరిగిన జాతీయ వెయిట్ లిఫ్టింగ్‌లో 74 కేటగిరి విభాగంలో రజీర్ రెండు రజత, ఒక కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా గురువారం 1979–80 బ్యాచ్ విద్యార్థులు, పోస్టుమాస్టర్ సయ్యద్ సుభానీ అధ్యక్షతన సన్మాన సభ నిర్వహించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ ఇస్మాయిల్ పాల్గొని నజీర్‌ను సన్మానించారు. నజీర్ వెయిట్ లిఫ్టింగ్‌లో రాష్ట్రానికి మంచి గుర్తింపు తెచ్చారన్నారు. వెయిట్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయిలో ఎన్నిక కావడం అభినందనీయమన్నారు. భవిష్యత్‌లో ఇంకా పతకాలు సాధించాలని సయ్యద్ సుభానీ కోరారు. కార్యక్రమంలో మిత్రమండలి సెక్రటరీ గుప్త ప్రసాద్, జి.శివారెడ్డి, డి.ప్రసాద్, వెంకటేశ్వర్లు, కృష్ణమూర్తి, ఆర్‌వీఆర్ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పీటీసీలో పీఎస్‌ఓలకు శిక్షణ

ఒంగోలు టౌన్: రానున్న సాధారణ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో వీఐపీల భద్రతపై పీఎస్‌ఓలకు రెండు రోజుల శిక్షణ తరగతులు స్థానిక పోలీస్ కళాశాలలో గురువారం ప్రారంభమయ్యాయి. వీఐపీల భద్రత, ఇతరా అంశాల్లో పీఎస్‌ఓలు విధి నిర్వహణలో వ్యవహరించాల్సిన తీరుతెన్నుల గురించి కళాశాల ప్రిన్సిపాల్ ఏఆర్ దామోదర్ వివరించారు. పీఎస్‌ఓలకు సూచనలు, సలహాలు ఇచ్చారు. శిక్షణ తరగతులను నాలుగు విడతలుగా నిర్వహిస్తామన్నారు. శిక్షణకు పల్నాడు, బాపట్ల, ఒంగోలు, గుంటూరు, నెల్లూరు తదితర జిల్లాలకు చెందిన 79 మంది పీఎస్‌ఓలు హాజరయ్యారు. ఇంటిలిజెన్స్ సెక్యూరిటీ వింగ్ డీఎస్పీ ఆశీర్వాదం, ఆర్ఐ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ ఉద్యోగాలకు జిల్లా నుంచి 33,484 మంది

ఒంగోలు టౌన్: పోలీసు కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్మెంట్ బోర్డు గురువారం దరఖాస్తు వివరాలను ప్రకటించింది. రాష్ట్రస్థాయి పోలీస్ రిక్రూట్మెంట్‌కు జిల్లా నుంచి 33484 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. రాష్ట్ర స్థాయిలో మొత్తం సివిల్ కానిస్టేబుల్ పోస్టులు 3580, ఏపీఎస్పీ 2520 పోస్టులను భర్తీ చేయనున్నారు. 6100 పోస్టులకు గాను నవంబర్ 28న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2023 జనవరి 7న దరఖాస్తులకు తుది గడువు ముగిసింది. 12 నుంచి 20వ తేదీ వరకు హాల్ టికెట్లను ఆన్‌లైన్‌లో డౌన్లోడ్ చేసుకునే సౌకర్యం కల్పించింది. ప్రిలిమినరీ టెస్టు ఈ నెల 22న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతుంది. తెలుగు, ఇంగ్లిష్, ఉర్దూ మీడియంలలో పరీక్ష నిర్వహిస్తారు.

గిజిగాడు అద్భుత ఇంజినీర్



గూడు నిర్మాణంలో పక్షి జాతుల్లో గిజిగాడికి ఎవరూ సాటిరారు. తేలిక గడ్డి పోచలతో టుంగుటూయలలు..గదులు వాటిలో మెత్తని పాన్పులు ఇలా గూడు కట్టడంలో ప్రదర్శించే కళాత్మకత, నైపుణ్యత, నేర్పరితనం అద్భుతం. రాత్రనక పగలనక పిల్ల గాలులకు హాయిని గొల్పే ఉయ్యాలల గూడు. సహజ నైపుణ్యంతో నిర్మించిన గూడును చూసిన వారందరూ అబ్బురపడాల్సిందే. సహజ సాంకేతికత శాస్త్రవేత్త, పక్షి ప్రజ్ఞాని గిజిగాడు. మహా కవి గుర్రం జాషువా ఖండ కావ్యాలకు అవి మూలమయ్యాయి. జిల్లాలో విస్తరించి ఉన్న నల్లమల అటవీ ప్రాంతంలో ఇవి కనువిందు చేస్తున్నాయి.

● గూడు కట్టడంలో అత్యంత నేర్పరితనం
● ప్రియురాలిని మెప్పించే ప్రేమ మందిరాలు
● నల్లమలలో కనువిందు చేస్తున్న గూళ్లు

పెద్దదోర్నాల: గిజిగాడు అనేది ఓ అందమైన పిచ్చుక. కాలువలు చెరువుల పక్కన ఒంగిన తుమ్మ కొమ్మలకో, ఈత చెట్లకో, తాటి చెట్లకో వేలాడుతూ వీటి గూళ్లు కనిపిస్తాయి. ఈ గూళ్లను గిజిగాడి గూడు అని సంబోధిస్తారు. ఇవి కొమ్మలకు వేలాడుతూ నింగికి నేలకు మధ్య ఊగుతూ కనిపిస్తాయి. ఈ గూళ్ల నిర్మాణంలో ఈ పక్షుల నిపుణత ఆశ్చర్యం కలిగిస్తుంది. తాటి నార, పీచు, గడ్డి మొదలైన వాటితో గజిగిజిగా అల్లుకునే ఈ గూళ్లు ఎంతో పొందికగానూ, అందంగా ఉంటాయి. వీటి గూళ్లు తలకిందుగా చేసిన కిరసనాయిలు దీపం చిమ్నిలా ఉంటాయి.

ప్రేమ కోసం...

నలమల అటవీ ప్రాంతంలో నీటి లభ్యత ఉండే ప్రాంతాల్లో ఎక్కుగా వీటి గూళ్లు కనబడతాయి. తుమ్మల బైలు వద్ద ఉన్న జంగిల్ సఫారిలో పర్యాటకులను ఇవి కనువిందు చేస్తున్నాయి. పెద్దచెరువు, పులిచెరువు పరిసర ప్రాంతాల్లో, మార్కాపురం పెద్ద చెరువు, కంభం చెరువు, మోపాడు రిజర్వాయర్, గుండ్లకమ్మ, రామతీర్థం ప్రాజెక్టు సమీపంలోని చెట్లకు ఎక్కువగా ఉండే ఈ గూళ్లు ఆకట్టుకుంటున్నాయి. పిల్లలను పోషించటం ఆడ పక్షుల బాధ్యత. గూళ్లు కట్టే బాధ్యత పూర్తిగా మగ పక్షులదే. వరి ఇతర గడ్డి మొక్కల ఆకుల నుంచి చీల్చుకుని వచ్చే పోచలతో ఈ గూడుని అల్లుతాయి. సగం అల్లిన గూడుని ప్రదర్శనకు పెట్టి రెక్కలాడిస్తూ తన ప్రియురాలికి సంకేతాలను అందిస్తుంది మగపక్షి. గూడు నచ్చితే ఆడపక్షి మగపక్షితో జత కట్టేందుకు అంగీకరిస్తుంది. ఆడపక్షి గూటిలో గుడ్లు పెడితే వాటి సంరక్షణ మగ పక్షే చూసుకుంటుంది. పిల్లలు గుడ్ల నుంచి బయటకు రాగానే వాటి పోషణ భారం అంతా ఆడపక్షే మోస్తుంది. ఇలా రెండు పక్షులు కలిసి చక్కటి సంసారాన్ని సాగించే గృహమే ఈ గిజిగాడి గూళ్లు. సామూహికంగా ఒకే చోట గూళ్లు కట్టుకుని నివసించే ఈ పక్షులు ఎవరైనా శత్రువులు దాడి చేస్తే మాత్రం మూకుమ్మడిగా ఎదుర్కొని తమ పిల్లలను సంరక్షించుకుంటాయి.

గిజిగాడిపై గుర్రం జాషువా కావ్యం

వీటి జీవిత కాలం సుమారు 13 నుంచి 15 సంవత్సరాలు మాత్రమే జీవిస్తాయి. ఇవి కీటకాలు, వివిధ రకాల విత్తనాలు తిని జీవిస్తాయి. ఎంత వర్షం వచ్చినా ఎంత గాలి వీచినా తమ గూడు తడవకుండా గూడు చెదరకుండా బలంగా నిర్మించుకుంటాయి. వీటి నైపుణ్యాన్ని మెచ్చి మహాకవి గుర్రం జాషువా ముచ్చటగా 5 ఖండ కావ్యాలను రచించారు. వీటి నేర్పరి తనాన్ని ప్రపంచానికి చాటి చెప్పాడు.

"జిలుగుం బంగరు రంగుల కులుకు మేల్చిన్నారి
పూగుత్తి సొమ్ములు గీలించిన తుమ్మ కొమ్మలకు
నీవున్ నీసతీ రత్నం మూయల గీయలు దగిలించి రేబవలు హాయిం దూగరా..
గాడ్పు బిడ్డలు మీకు ఊడిగమాచరింప, గిజిగాడా నీకు దీర్ఘాయువౌ...."

బంగారు జిలుగుల్లా కులుకుతున్న చిన్న చిన్న పూగుత్తులు ఉన్న తుమ్మ కొమ్మలకు నీవును నీ భార్య ఇద్దరూ కలిసి ఊయల గృహాన్ని తగిలించారు. రేయింబగలు హాయిగా ఊగుతున్న నీ గృహాన్ని ఊపుతూ పిల్లగాలులు నీకు ఊడిగం చేస్తున్నాయి. పిల్లగాలులు మీ గృహాన్ని ఊపుతుంటే నీవు ఎంతగా ఆరోగ్యంగా, హాయిగా జీవిస్తున్నావో గిజిగాడా....నీవు దీర్ఘాయుడవు అని మహాకవి గుర్రం జాషువా గిజిగాడు నేర్పరితనంపై అద్భుతమైన కావ్యాన్ని రచించారు.

అద్భుత నైపుణ్యం గిజిగాడి సొంతం

గిజిగాడు పక్షి ఎంతో నైపుణ్యం ఉన్న పక్షి. గూడు కట్టడంలో వీటికి ఇవే సాటి. ఆడపక్షి ప్రేమ కోసం అందమైన గూళ్లు కట్టి వాటిని ఆకర్షిస్తాయి. నల్లమల అటవీ ప్రాంతంలో ఇవి ఎక్కువగా కనిపిస్తుంటాయి. వీటి రక్షణ కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. ఇవి పర్యాటకులను కూడా విశేషంగా ఆకర్షిస్తుంటాయి.

– షేక్ మహమ్మద్ హయాత్,
ఫారెస్టు రేంజి అధికారి,
శ్రీశైలం బయోడైవర్సిటీ.





ఆపరేషన్ చెన్నై బోట్స్..



చెన్నై బోటును వెంబడిస్తున్న మత్స్యకారుల బోటు

● నడి సముద్రంలో రెండో రోజూ కొనసాగిన వార్
● రెండు బోట్లలో మూడు కిలో మీటర్లు వెంబడించి..
● కలిసికట్టుగా వెంటాడి చెన్నై బోట్లను తరిమికొట్టిన మెరైన్, మత్స్యశాఖ, మత్స్యకారులు
● వలలు వేయకుండా పారిపోయిన చెన్నై మత్స్యకారులు



చెన్నై బోటును తరుముతున్న మెరైన్ పోలీసులు

సింగరాయకొండ: నడిసంద్రంలో చెన్నై మత్స్యకారులకు, మన జాలర్ల మధ్య వార్ రెండో రోజూ కొనసాగింది. అక్రమంగా జొరబడి లక్షలాది రూపాయిల విలువైన మత్స్య సంపదను దోచుకుపోతున్న చెన్నై మత్స్యకారులను మనవాళ్లు తరిమికొట్టారు. బుధవారం కొత్తపట్నం తీరంలో జరగ్గా...గురువారం సింగరాయకొండ మండలం పోతయ్యగారి పట్టపుపాలెం వద్ద ఈ ఘటన చోటు చేసుకుంది.

ఎన్నో ఏళ్లుగా..

చెన్నై, పాండిచ్చేరికి చెందిన మత్స్యకారులు సముద్రతీర ప్రాంత నిబంధనలకు వ్యతిరేకంగా మెకనైజ్డ్ బోట్లలో చేపల వేట సాగిస్తూ రూ.లక్షల విలువైన వలలు ధ్వంసం చేయడంతో పాటు విలువైన మన మత్స్య సంపదను దోచుకుంటూ జిల్లా పరిధిలోని తీరప్రాంత జాలర్లకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు.

రెండో రోజూ ఇలా..

బుధవారం కొత్తపట్నం తీరంలో చెన్నై బోట్లు వేటకు రాగా..రెండో రోజు పాకల సముద్ర తీరప్రాంతంలో తమిళనాడు రాష్ట్రం కడలూరుకు చెందిన మూడు మెకనైజ్డ్ బోట్లు తీరానికి దగ్గరగా సుమారు ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో చేపల వేట సాగిస్తున్నారు. సమాచారం అందుకున్న మత్స్యశాఖ జేడీ ఏ చంద్రశేఖరరెడ్డి, రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్ఎస్ కిషోర్‌కుమార్ సిబ్బందితో పాకల పంచాయతీలోని పోతయ్యగారి పట్టపుపాలెం సముద్రతీరానికి చేరుకున్నారు. తరువాత ఒక్కో బోటులో ఏడుగురు మెరైన్ పోలీసులు, ముగ్గురు మత్స్యశాఖ అధికారులు, ఇద్దరు మత్స్యకారులు రెండు మోటరైజ్డ్ బోట్లలో చెన్నై బోట్లను వెంబడించారు. సుమారు 3 కిలోమీటర్ల దూరం వారిని వెంబడించి వారికి ముచ్చెమటలు పట్టించారు. చెన్నై జాలర్లకు చుక్కలు చూపించడంతో వారు దిక్కు తోచని స్థితిలో తోడముడిచి పలాయనం సాగించారు. మత్స్యశాఖ ఏడీ ఏ ఉషాకిరణ్, గ్రామ సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంట్లు, సాగర్‌మిత్ర, మెరైన్ పోలీసులు, మత్స్యకారులు ప్రళయకావేరి రోశయ్య పాల్గొన్నారు.

మేం అండగా ఉంటాం

మత్స్యకారులకు మేం అంటామని మత్స్యశాఖ జేడీ చంద్రశేఖరరెడ్డి, రామాయపట్నం మెరైన్ సీఐ ఆర్ఎస్ కిషోర్‌కుమార్‌లు భరోసా ఇచ్చారు. మన తీరంలో వేటాడితే చెన్నై బోట్లను ఉపేక్షించేది లేదని, తరిమి తరిమి కొడతామన్నారు.



చెన్నై బోట్లను అడ్డుకునేందుకు సిద్ధమైన మెరైన్, మత్స్యశాఖ అధికారులు

వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

● కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: స్వామి వివేకానందను యువత ఆదర్శంగా తీసుకుని ఉజ్వల భవిష్యత్‌కు సంకల్పించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. వివేకానంద జయంతిని పురస్కరించుకుని కొత్తపట్నం బస్టాండ్ సెంటర్‌లోని విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. కలెక్టర్‌తో పాటు నగర మేయర్ గంగాడ సుజాత పాల్గొని నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జ్ఞానానికి, పరిపక్వతకు, సంకల్ప బలానికి వివేకానంద నిదర్శనమన్నారు. తక్కువ వయసులోనే ప్రపంచ ప్రఖ్యాతి చెందిన వ్యక్తి అని కొనియాడారు. మన దేశ ఘనతను విదేశాల్లో చాటిన వివేకానంద అడుగు జాడల్లో యువత నడవాలని పిలుపునిచ్చారు. యువతను ప్రేరేపించడంలో వివేకానంద తనదైన ముద్ర వేసుకున్నారన్నారు. దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ తమ వంతు పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ విలువలకు, సమున్నత వ్యక్తిత్వానికి ప్రతీకగా నిలిచిన వివేకానందుడు ప్రతి ఒక్కరికి ఆదర్శప్రాయమన్నారు. కార్యక్రమంలో స్టెప్ సీఈఓ బాబురావు, మెప్మా పీడీ రవికుమార్, డీఈఓ విజయభాస్కర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత

ఉద్యాన పంటల సాగుకు ప్రోత్సాహం



హాజరైన అధికారులు, పైపుల కంపెనీల ప్రతినిధులు



మాట్లాడుతున్న రాష్ట్ర ఉద్యానవన శాఖ ఓఎస్‌డీ రమేష్, పక్కన ఏపీఎంఐపీ పీడీ రవీంద్రబాబు

● రాష్ట్ర ఉద్యానవన శాఖ ఓఎస్‌డీ రమేష్

ఒంగోలు సబర్బన్: ఉద్యాన పంటల సాగుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు రాష్ట్ర ఉద్యానవన శాఖ ఓఎస్‌డీ డి.రమేష్ అన్నారు. స్థానిక ఒంగోలు ఉద్యానవన శాఖ ఏడీ కార్యాలయంలో ఉద్యాన రైతు శిక్షణ కేంద్రంలో ఉద్యానవన అధికారులు, మైక్రో ఇరిగేషన్ కంపెనీ ప్రతినిధులు, పైపుల కంపెనీల ప్రతినిధులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ జిల్లాకు ఈ ఏడాదిలో 16 వేల హెక్టార్లలో ఉద్యాన తోటల పెంపకం లక్ష్యంగా నిర్ణయించామన్నారు. అదేవిధంగా రూ.196.30 కోట్ల ఆర్థిక లక్ష్యాన్ని నిర్ణయించామని తెలిపారు. ఇప్పటి వరకు జిల్లా వ్యాప్తంగా రైతు భరోసా కేంద్రాల ద్వారా 18,206 మంది రైతులు డ్రిప్ అండ్ స్ప్రింకర్ల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. 1,753 హెక్టార్లలో డ్రిప్ అండ్ స్ప్రింకర్ల కోసం ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకున్నారని పేర్కొన్నారు. 5,282 మంది రైతులు 5,800 హెక్టార్లలో ఉద్యాన పంటలు సాగు చేసుకునేందుకు రైతులు వాటాధనాన్ని చెల్లించారని తెలిపారు. వీరందరికి కలెక్టర్ నుంచి పరిపాలనాపరమైన అనుమతి తీసుకొని డ్రిప్ అండ్ స్ప్రింకర్లను అందజేస్తామన్నారు. సరఫరా చేసిన పరికరాలను రైతులకు చెందిన పొలాల్లో ఏర్పాటు చేయాలని కంపెనీ ప్రతినిధులను ఓఎస్‌డీ రమేష్ ఆదేశించారు. రైతులంతా ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలో ఇంకా 1,28,700 హెక్టార్లలో డ్రిప్ అండ్ స్ప్రింకర్లను సరఫరా చేసేందుకు ఉందని తెలిపారు. రానున్న నాలుగేళ్లలో లక్ష్యాన్ని పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఏపీఎంఐపీ పీడీ బి.రవీంద్రబాబు, ఉద్యానవన శాఖాధికారి, గోపీచంద్ పాల్గొన్నారు. అనంతరం అధికారుల బృందం జిల్లాలోని సంతనూతలపాడు, చీమకుర్తి మండలాల్లోని తోటలను పరిశీలించారు.

మిన్నంటిన సంక్రాంతి సంబరం





సంక్రాంతి సంబరాల్లో జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్ రెడ్డి

● జెడ్పీలో సంప్రదాయబద్ధంగా సంక్రాంతి సంబరాలు
● ప్రజలు భోగభాగ్యాలతో తులతూగాలన్న జెడ్పీ చైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ

ఒంగోలు: జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జిల్లా పరిషత్ ఉద్యోగులు, జెడ్పీ మినిస్టీరియల్ ఉద్యోగులు, నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు సంక్రాంతి సంబరాలను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మను వేదపండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ముందుగా గంగిరెద్దుల విన్యాసాలు ఔరా అనిపించాయి. అనంతరం ధాన్యలక్ష్మి చిత్రపటం వద్ద ప్రత్యేక పూజలు చేసి నవధాన్యాలతో పొంగలిని జెడ్పీ చైర్మన్‌తో పాటు మహిళా ఉద్యోగులు వండారు. అనంతరం ప్రత్యేక వేదికపై చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శన అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చిన్నారులతో పాదం కలిపి అందరినీ సంభ్రమాశ్చరాలలో ముంచెత్తారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడుతూ తెలుగువారు అపురూపంగా భావించే అతిపెద్ద పండుగల్లో సంక్రాంతి చాలా ముఖ్యమైందన్నారు. సంక్రాంతి అంటేనే పల్లె వాతావరణం కళ్లకు కట్టినట్లుగా కనిపిస్తుందని, పండుగను ప్రతి ఒక్కరూ సంతోషంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. దర్శి మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ సంక్రాంతి ప్రతి ఇంటా ఎంతో ఆనందంగా జరుపుకునే పండుగన్నారు. పంటలు పండి ధాన్యం ఇంటికి వచ్చే సమయంలో వచ్చే ఈ సంక్రాంతిని ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ బి.జాలిరెడ్డి, డిప్యూటీ సీఈఓ హనుమంతరావు, ఉద్యోగ సంఘాల నాయకులు విద్యాసాగర్, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీ చైర్‌పర్సన్ స్టెప్పులు అదిరే...

ఒంగోలు: సంక్రాంతి సంబరాల్లో భాగంగా జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ చిన్నారులతో కలిసి స్టెప్పులేసి ఔరా అనిపించారు. స్థానిక జిల్లా ప్రజా పరిషత్ కార్యాలయంలో జరిగిన సంబరాల్లో చిన్నారులు వేస్తున్న 'ఎల్లువచ్చి గోదారమ్మా వెల్లకిల్లా పడ్డాదమ్మో .. ' అనే పాటకు చిన్నారులతో కలిసి నృత్యం చేసి అందరినీ ఆకట్టుకున్నారు. విద్యార్థినులు సైతం ఆమెతో పాటు పాదం కలిపి డ్యాన్స్ చేశారు. అనంతరం ఆమె ఉమ్మడి ప్రకాశం జిల్లా ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.



విద్యార్థినులతో కలిసి డ్యాన్స్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ

22న షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాకారుల ఎంపిక

ఒంగోలు: ఉమ్మడి ప్రకాశం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ వెటరన్/మాస్టర్స్ క్రీడాకారుల ఎంపిక ఈనెల 22న స్థానిక సీవీఎన్ రీడింగ్ రూమ్, హైదరీ క్లబ్ ఆవరణలో నిర్వహించనున్నట్లు సంఘ జిల్లా చైర్మన్, అధ్యక్ష, కార్యదర్శులు అద్దంకి మురళీకృష్ణ, జె.లక్ష్మణ్ రెడ్డి, పావులూరి విజయకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. క్రీడాకారులు తమ పేరు రిజిస్టర్ నిమిత్తం సింగిల్స్ అయితే రూ.200, డబుల్స్ అయితే రూ.400 చెల్లించాలన్నారు. ఎంపిక 35ప్లస్, 40ప్లస్, 45ప్లస్, 50ప్లస్, 60ప్లస్, 70ప్లస్ వయసుల వారీగా పోటీలు నిర్వహిస్తామన్నారు. ఎంపికైన క్రీడాకారులు జిల్లా తరుపున కడప జిల్లా పొద్దుటూరులో త్వరలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందన్నారు. అభ్యర్థులు 20వ తేదీ లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు పి.విజయకృష్ణ 9440267555, బి.అశోక్‌రెడ్డి 7893806669 నంబర్లను సంప్రదించాలని కోరారు.

క్లుప్తంగా

రేపటి నుంచి జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు

కొనకనమిట్ల(మర్రిపూడి): సంక్రాంతి పండుగను పుస్కరించకుని కొనకనమిట్ల మండలంలోని గొట్లగట్టు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ నెల 14, 15, 16 తేదీల్లో జిల్లాస్థాయి కబడ్డీపోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. టోర్నమెంట్ పోటీలల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.30వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25వేలు, తృతీయ బహుమతిగా రూ. 20వేలు, నాల్గవ బహుమతి రూ.15వేలు, ఐదవ బహుమతి రూ 10 వేలు, ఆరో బహుమతిగా రూ.5 వేల నగదు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. పోటీలను ఎమ్మెల్యే కేపీ నాగార్జున రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఉడుముల శ్రీనివాసరెడ్డి ప్రారంభిస్తారన్నారు. ఆసక్తి ఉన్న వారు 8096476870, 9912312365 నంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు వాలీబాల్ పోటీలు

పీసీపల్లి: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని జీవీపల్లి యూత్, నారపరెడ్డి బ్రదర్స్ ఆధ్వర్యంలో ఈ నెల 14, 15 తేదీల్లో వాలీబాల్ పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రవేశరుసుం రూ.500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు రూ.10,016, రూ.7,016 అందజేస్తామన్నారు. వివరాలకు 9949860309, 9000843755 నంబర్లను సంప్రదించాలని కోరారు.

కరవదిలో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు

ఒంగోలు రూరల్: అఖిల భారత యువజన సమాఖ్య 72వ వార్షికోత్సవం సందర్భంగా కరవదిలో ఈ నెల 13, 14 తేదీల్లో రాష్ట్రస్థాయి చెడుగుడు పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో మొదటి బహుమతి రూ.10 వేలు, రెండో బహుమతి రూ.8 వేలు, మూడవ బహుమతి రూ.6 వేలు, నాల్గవ బహుమతి రూ.4 వేలు అందజేస్తామన్నారు. అదే విధంగా షటిల్, డ్యాన్స్ పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసుల్లో అలసత్వం వద్దు



సమీక్షలో మాట్లాడుతున్న ఎస్పీ మలికా గర్గ్



సమీక్షలో పాల్గొన్న డీఎస్పీలు

● ఎస్పీ మలికా గర్గ్

ఒంగోలు టౌన్: ఎస్సీ, ఎస్టీ కేసుల నమోదు, దర్యాప్తులో అలసత్వాన్ని సహించేది లేదని ఎస్పీ మలికా గర్గ్ అన్నారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం డీఎస్పీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటి వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను సమీక్షించారు. వివిధ దశల్లో ఉన్న కేసుల గురించి ఆరా తీశారు. ఆయా కేసుల దర్యాప్తు, పురోగతి, నిందితుల అరెస్టులు, చార్జిషీటు దాఖలు చేసే విషయాలలో అధికారులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. ఎస్సీ, ఎస్టీ కేసుల్లో విచారణను త్వరితగతిన పూర్తిచేసి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. ముగిసిన కేసుల్లో నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపించాలని చెప్పారు. అట్రాసిటీ కేసుల్లో ఫిర్యాదు అందిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకోవాలని సూచించారు. డీఎస్పీ స్థాయి అధికారులు ప్రత్యేక దర్యాప్తు చేస్తున్న పోక్సో, చిట్‌ఫండ్ చీటింగ్, దొంగతనం, భౌతికదాడులు, ఐటీ కేసులు, రోడ్డు ప్రమాదాలు, హత్య కేసులను సమీక్షించి సూచనలు చేశారు. పోక్సో కేసుల్లో వేగంగా పెంచాలన్నారు. కోర్టుల్లో శిక్షల శాతం పెంచేందుకు కృషి చేయాలని దిశానిర్దేశం చేశారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయ పరిధిలోని మహిళా పోలీసులకు కేటాయించిన టాస్కులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అధికారులకు పలు సూచనలు చేశారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ(అడ్మిన్) కె.నాగేశ్వరరావు, డీఎస్పీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ యు.నాగరాజు, దర్శి డీఎస్పీ నారాయణస్వామిరెడ్డి, మార్కాపురం డీఎస్పీ కిశోర్‌కుమార్, డీటీసీ డీఎస్పీ రామకృష్ణ, దిశా డీఎస్పీ ఏ.పల్లపురాజు, డీసీఆర్‌బీ సీఐ దేవప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వాసానికి మారుపేరు ఉపాధ్యాయులు

● వ్యాయామ ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి



ఎమ్మెల్సీని సత్కరిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులు

ఒంగోలు: విశ్వాసానికి మారుపేరు ఉపాధ్యాయ మిత్రులు అని ఎమ్మెల్సీ టి.కల్పలతారెడ్డి అన్నారు. గురువారం ఒంగోలు వచ్చిన ఆమె కొద్దిసేపు స్థానిక రెస్టారెంట్‌లో వ్యాయామ ఉపాధ్యాయులతో కలిసి ఆత్మీయ విందులో పాల్గొన్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 12 నియోజకవర్గాల నుంచి వ్యాయామ సంఘాల నాయకులు వచ్చి ఎమ్మెల్సీని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ మద్దతుతో బరిలోకి దిగనున్న చంద్రశేఖరరెడ్డి, ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి మాట్లాడుతూ ఉపాధ్యాయులంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అత్యంత గౌరవమన్నారు. ఫేషియల్ రికగ్నేషన్ యాప్ వంటివి భావితరాన్ని క్రమశిక్షణతో ఉండేలా చేయాలనే తలంపుతోనే అన్నారు. ఉపాధ్యాయులను ఆదర్శంగా చూపిస్తూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలనే ఆకాంక్షతోనే ఈ యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తరువాత ఎన్నో ఏళ్లగా పెండింగ్‌లో ఉన్న వ్యాయామ ఉపాధ్యాయులు, పండిట్ పదోన్నతులు ఇచ్చారన్నారు. పదోన్నతులు అందుకున్న వారు ప్రభుత్వానికి కృతజ్ఞత చూయించాల్సిన అవసరం ఉందన్నారు. త్వరలో ఉపాధ్యాయ, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలు జరగనున్నాయని, ఆ ఎన్నికల్లో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖరరెడ్డిని గెలిపించుకోవడం ద్వారా మరో బలమైన అండ శాసనమండలిలో లభిస్తుందన్నారు. చంద్రశేఖర్‌రెడ్డి కరోనా సమయంలో రోజుకు 80 వేల మందికి భోజనం అందించారని గుర్తు చేసుకున్నారు. వైఎస్సార్‌టీచర్స్ ఫెడరేషన్ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు కేశవరపు జాలిరెడ్డి మాట్లాడుతూ మంచి మనిషిని ఎన్నుకున్నపుడే మన సమస్యలకు సరైన పరిష్కారం లభిస్తుందన్నారు. అందుకు తగ్గ వ్యక్తి చంద్రశేఖరరెడ్డి అని, కనుక ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యాయామ ఉపాధ్యాయ సంఘ నేతలు నత్తల కృష్ణ తదితరులు మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తమకు పదోన్నతులు కల్పించి స్కూల్ అసిస్టెంట్ హోదా తీసుకువచ్చారన్నారు. ఎమ్మెల్సీ వెంట ఆళ్ల రామకృష్ణారెడ్డి సోదరుడు నాగిరెడ్డి, వైఎస్సార్‌టీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు జి.వెంకటేశ్వరరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయ సంఘాల నాయకులు నత్తల కృష్ణ, విష్ణుప్రసాద్, చిరంజీవిరెడ్డి, శివశంకర్, అంజిరెడ్డి, అనీల్, వేణుగోపాల్, కుమార్, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఐక్యత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జంకె వెంకటరెడ్డి

● వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి

మార్కాపురం: క్రీడలతో సమైక్యత వస్తుందని, సోదర భావం పెరుగుతుందని, గెలుపోటములను సమానంగా స్వీకరించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జంకె వెంకటరెడ్డి అన్నారు. మార్కాపురం తూర్పువీధి రెడ్డిస్ యూత్ ఆధ్వర్యంలో సౌత్ ఇండియన్ టెన్నీస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీల ముగింపు సభ గురువారం సాయంత్రం ఎస్వీకేపీ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. పోటీలు గత నెల 28 నుంచి జరుగుతున్నాయి. రెండు రాష్ట్రాల నుంచి 70కి పైగా జట్లు పాల్గొన్నాయి. ముగింపు సభకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మాట్లాడుతూ ఏటా సంక్రాంతి సందర్భంగా రెడ్డిస్ యూత్ జాతీయ స్థాయిలో ఇలాంటి పోటీలను నిర్వహించటం అభినందనీయమన్నారు. గెలుపోటములను క్రీడాకారులు సమానంగా స్వీకరించాలని, క్రీడా స్ఫూర్తితో ఆడాలని సూచించారు. ప్రథమ బహుమతిగా రూ.1,01,116, గుంటక సుబ్బారెడ్డి, తాడిపత్రి చెన్నారెడ్డి, గుంటక వెంకటరెడ్డి, ద్వితీయ బహుమతిగా 50,116లను గుంటక చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ ఎం.పుష్పలత రామకృష్ణారెడ్డి, తృతీయ బహుమతిగా రూ.20,116లను గొలమారి నాగేంద్రరెడ్డి అందించారు. కార్యక్రమంలో మారంరెడ్డి చంద్రశేఖరరెడ్డి, మందటి మహేశ్వరరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 48 గొర్రెలు మృతి

● రూ.5 లక్షల వరకు నష్టం
● కాపరులకు న్యాయం జరిగేలా చూస్తామన్న ఎంపీపీ



చనిపోయిన జీవాలను పరిశీలిస్తున్న ఏడీ, ఎంపీపీ

మద్దిపాడు: గొర్రెల మందపై కుక్కలు దాడి చేసి 48 గొర్రెలను చంపేశాయి. ఈ సంఘటన మండలంలోని బూరేపల్లి పునరావాస కాలనీలో గురువారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన కన్నెబోయిన గురవయ్య, నాగమణి, కొణికి వెంకయ్యలు గొర్రెల మందను బుధవారం రాత్రి దొడ్డిలో వదిలేసి వెళ్లారు. తిరిగి గురువారం తెల్లవారుజామున దొడ్డి శుభ్రపరచడానికి వచ్చిన సమయంలో గొర్రెలు మృతి చెందిన విషయం గుర్తించారు. ఈ క్రమంలో వారు మద్దిపాడు ఏడీఏ పి.రామారావుకు సమాచారం అందించగా ఆయన సిబ్బందితో ఘటనా స్థలానికి వెళ్లారు. విషయం తెలుసుకున్న ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మండవ అప్పారావు ఘటనా స్థలానికి చేరుకున్నారు. గొర్లకాపరులు చెప్పిన వివరాల మేరకు రాత్రి సమయంలో వీధికుక్కలు దొడ్డిలోకి చొరబడి 48 గొర్రెలు పిల్లలను మెడలు కొరికి చంపేశాయి. గతంలో కూడా గొర్రెలపై దాడి చేసి చంపాయని, కానీ ఈ సారి మాత్రం పెద్ద సంఖ్యలో గొర్రెలను చంపాయన్నారు. సుమారు రూ.5 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయారు. గురవయ్యకు చెందిన గొర్రెలు 20, నాగమణికి చెందిన గొర్రెలు 19, వెంకయ్యకు చెందిన గొర్రెలు 9 కుక్కల దాడిలో చనిపోయినట్లు తెలిపారు. పునరావాస కాలనీలో కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని కట్టడి చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ క్రమంలో వాకా కోటిరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారులతో మాట్లాడి నష్టపరిహారం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఏడీఏ రామారావును కోరారు. ఏడీఏ మాట్లాడుతూ విషయాన్ని పశుసంవర్ధక శాఖ జేడీ బేబీరాణి దృష్టికి తీసుకువెళ్లి బాధితులకు నష్టపరిహారం అందేలా కృషి చేస్తామని తెలిపారు. వారి వెంట వైస్ ఎంపీపీ పైడి పాటి వెంకట్రావు, గొర్రెల పెంపకం దారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శిలార్ పెద్దబ్బాయి, జిల్లా కార్యదర్శి తోట తిరుపతి రావు, పశువైద్యాధికారి మాధవి, ఉబ్బా వెంకటేశ్వర్లు, నాయకులు వెంకటాద్రి, శేషయ్య పశువైద్య శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

పోలురాధ జూనియర్స్ విజేత కృష్ణా



సీనియర్స్ పోలురాధ పోటీల్లో పాల్గొన్న ఎడ్ల జత

పర్చూరు: మండలంలోని అన్నంభొట్లవారిపాలెంలో నిర్వహిస్తున్న 35వ జాతీయ స్థాయి పోలురాధ జూనియర్స్ విభాగంలో కృష్ణాజిల్లా ఎడ్ల జత ప్రథమ బహుమతిని గెల్చుకుంది. చల్లపల్లి మండలం, కొత్తమాజేరు గ్రామానికి చెందిన తుమ్మల వెంకటరావు కోడెల జత 2,466.7 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి గెల్చుకుంది. బాపట్ల జిల్లా సుబ్బారెడ్డిపాలేనికి చెందిన సుబ్బారెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయంలో 2,326.10 అడుగుల దూరం లాగి ద్వితీయ బహుమతి, ఇదే జిల్లా, పోతురాజు కొత్తపాలేనికి చెందిన చిట్టిమాల చిన్న ఎడ్ల జత 2,174.11 అడుగుల దూరం లాగి తృతీయ బహుమతి గెలుపొందాయి. ఇదే జిల్లా, పాతచీరాలకు చెందిన ఎస్.ఎస్.వి.రెడ్డి బుల్స్ వారి ఎడ్ల జత 2,126.4 అడుగుల దూరం లాగి నాలుగో బహుమతిని గెల్చుకోగా, బాపట్ల జిల్లా, పోతురాజు కొత్తపాలెంకు చెందిన కావూరి చిన అంకిరెడ్డి ఎడ్ల జత 2,119.5 అడుగుల దూరం లాగి ఐదో బహుమతిని గెల్చుకుంది. చీరాల మండలం, బోయినవారిపాలెంకు చెందిన కృష్ణాయాదవ్ ఎడ్ల జత 2,107 అడుగుల దూరం లాగి ఆరో బహుమతిని, చీరాల మండలం, ఈపూరుపాలెంకు చెందిన కరణం నరసింహారావు ఎడ్ల జత 2,100 అడుగుల దూరం లాగి ఏడో బహుమతిని గెల్చుకున్నాయి. విజేతలైన ఎడ్ల యాజమానులకు నగదు బహుమతితో పాటు జ్ఞాపికలు అందజేశారు. కాగా గురువారం రాత్రి పోలురాధ సీనియర్స్ విభాగంలో ఎడ్ల జతలకు పోటీలు జరుగుతున్నాయి. మొత్తం ఈ విభాగంలో 22 జతలు పాల్గొంటున్నట్లు నిర్వాహకులు గోరంట్ల భాస్కరరావు తెలిపారు. శుక్రవారం సాయంత్రం నుంచి పాలపళ్ల విభాగంలో బండలాగు బలప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

అపార్ట్‌మెంట్‌లో విషాదం



మృతి చెందిన శ్రీవిద్య మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై చౌదరి



అపార్టుమెంట్‌లోని మూడో అంతస్తులో మెట్ల ల్యాండింగ్ బల్ల కూలిన దృశ్యం



మృతి చెందక ముందు గాయాలతో కొల్లా రాణి

● మెట్ల ల్యాండింగ్ బల్ల కూలడంతో ఇద్దరు మహిళలు మృతి

పర్చూరు: మెట్ల ల్యాండింగ్ బల్ల హఠాత్తుగా కూలి పోవడంతో ఇద్దరు మహిళలు మృతి చెందారు. ఈ సంఘటన పర్చూరులోని పవన్‌సాయి అపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకుంది. ఎస్సై జి.వి.చౌదరి వివరాల ప్రకారం.. మూడో అంతస్తుకు వెళ్లే మెట్ల ల్యాండింగ్ బల్లపై నుంచొని చాగంటి శ్రీవిద్య (36) మరో మహిళ కొల్లా అనూరాధ (55) మాట్లాడుకుంటున్నారు. ఈ సమయంలో హఠాత్తుగా ల్యాండింగ్ బల్ల కూలిపోయి రెండో అంతస్తు ల్యాండింగ్ బల్లపై.. అనంతరం గ్రౌండ్ ఫ్లోర్‌లో పడిపోయింది. ఈ ఘటనలో బల్లతో పాటు పడిపోయిన శ్రీవిద్య అక్కడికక్కడే మృతి చెందిగా కొల్లా అనూరాధకు తీవ్ర గాయాలు కావడంతో పర్చూరు ప్రభుత్వాసుపత్రికి.. అనంతరం గుంటూరు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. శ్రీవిద్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నిర్మాణ లోపాల వల్ల ఇలా జరిగిందా.. మరి ఇతర కారణాలా అని దర్యాప్తులో తెలియాల్సి ఉంది. శ్రీవిద్య కుటుంబం గత ఏడేళ్ల నుంచి అపార్టుమెంటులో బాడుగకు ఉంటున్నారు. ఈమెకు భర్త ఇద్దరు పిల్లలున్నారు. అనూరాధ కుటుంబ సభ్యులు 2011లో అపార్టుమెంటలో ఓ ప్లాట్‌ను కొనుగోలు చేసి ఉంటున్నారు. ఈమెకు భర్త ఇద్దరు పిల్లలున్నారు

ఆటో, మోటార్‌సైకిల్ ఢీ

● ఒకరు మృతి



చిన్న మృతదేహం

లింగసముద్రం: ఆటో, మోటార్‌సైకిల్‌ను ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందారు. ఈ ఘటన మండలంలోని పెంట్రాల నుంచి మొగిలిచర్ల వెళ్లే రోడ్డులో బుధవారం రాత్రి జరిగింది. ఎస్సై ఆవుల వెంకటేశ్వర్లు అందించిన వివరాల మేరకు..వలేటివారిపాలెం గ్రామానికి చెందిన జయంపు చిన్న (36) కుటుంబసభ్యులతో మండలంలోని మొగిలిచర్లలో మినుము పొలాలకు కాపలాగా ఉంటున్నాడు. బుధవారం వలేటివారిపాలెం మండలంలోని అంకభూపాలపురంలో బంధువుల కర్మ కాండలకు వెళ్లి తిరిగి వస్తుండగా పెంట్రాల నుంచి మొగిలిచర్ల వెళ్లే రోడ్డులో పాల కేంద్రం వద్ద ఎదురుగా వస్తున్న ఆటో బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో చిన్న తారు రోడ్డుపై కింద పడడంతో తలకు, కాళ్లు, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళుతున్న వారు 108 తెలియపరచడంతో గాయాలతో ఉన్న చిన్నను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

● ఒకరి మృతి, పలువురికి గాయాలు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న సీఐ

కొనకనమిట్ల: వారంతా ఒకే కాలనీ వాసులు, బంధువులు కూడా..అయితే చిన్నపాటి గొడవలు పెద్దవి కావడం, వర్గాలుగా విడిపోయి కొట్లాటకు దిగారు. బుధవారం రాత్రి ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఒకరు మృతి చెందగా పలువురు గాయపడ్డారు. ఈ సంఘటన కొనకనమిట్ల మండలం కాట్రగుంట పంచాయతీ నర్సాయపల్లి(కొమ్మొళ్లపల్లి) ఎస్సీ కాలనీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. కాలనీకి చెందిన తాళ్లూరి ప్రకాశం, తాళ్లూరి ఎల్లయ్య మధ్య ఇటీవల చిన్నపాటి గొడవలు జరిగాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి జరిగిన గొడవలో ఎల్లయ్య వర్గానికి చెందిన తాళ్లూరి వినోద్(23) తీవ్రంగా గాయపడ్డాడు. తలకు తీవ్ర గాయమవడంతో వినోద్‌ను మెరుగైన వైద్యం నిమిత్తం ఒంగోలు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. మృతుడు వినోద్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. గొడవల విషయం తెలుసుకున్న పొదిలి సీఐ సుధాకరరావు నర్సాయపల్లి వెళ్లి కాలనీవాసులతో మాట్లాడి గొడవలకు కారణాలను తెలుసుకున్నారు. ఇరువర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 11 మందిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే కాలనీలో ఇలా జరగటంతో కాలనీ వాసులు భయాందోళనలు చెందుతున్నారు.

గ్రానైట్ ట్రేడర్‌కు టోకరా

● రూ. 4.5 లక్షల ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్
● అనంతరం స్విఛ్‌ఆఫ్ చేసిన మధ్యవర్తి

మార్టూరు: మధ్యవర్తి ద్వారా గ్రానైట్ స్లాబులు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించిన ట్రేడర్ రూ. 4.5 లక్షలు పోగొట్టుకున్న వైనం గురువారం మార్టూరులో వెలుగు చూసింది.. హైదరాబాద్‌లో గ్రానైట్ ట్రేడింగ్ చేసే ఓ వ్యాపారికి గ్రానైట్ స్లాబులు ఇప్పిస్తానంటూ మధ్యవర్తి మూడు లారీల లోడుకు ఒప్పందం చేసుకున్నాడు. తక్కువ ధరకు దొరుకుతాయని ట్రేడర్ ముందు వెనుక ఆలోచించక ఆన్‌లైన్ పేమెంట్‌కు ఒప్పుకున్నాడు. ఈ క్రమంలో మధ్యవర్తి స్థానిక జొన్నతాళి గ్రామ సమీపంలోని ఓ గ్రానైట్ ఫ్యాక్టరీలో అడుగు రూ. 80 చొప్పున కొనుగోలు చేసేందుకు బేరం మాట్లాడుకొని రెండు లారీలకు స్లాబుల లోడు ఎక్కించాడు. ధర విషయం ట్రేడర్‌కు తెలియకుండా జాగ్రత్త పడుతూ మధ్యవర్తి.. గ్రానైట్ ఫ్యాక్టరీ యజమాని ద్వారా స్లాబు లోడు పూర్తవుతుందని ట్రేడర్‌తో ఫోన్‌లో చెప్పించాడు. అనంతరం మధ్యవర్తి ఇచ్చిన బ్యాంకు ఖాతాకు హైదరాబాద్ నుంచి ట్రేడర్ రూ. 4.5 లక్షలకు ట్రాన్స్‌ఫర్ చేశాడు. తనకు ఎంత ధరకు గ్రానైట్ స్లాబులు బయలు దేరిన సమాచారం తెలియక పోవటంతో అనుమానం వచ్చిన ట్రేడర్ ఫ్యాక్టరీ యజమానికి ఫోన్ చేయగా తనకు నగదు అందకుండా స్లాబులు ఎలా పంపిస్తాను, నగదు అందలేదని చెప్పాడు. దీంతో గ్రానైట్ ట్రేడర్ తాను మోసపోయినట్లు తెలుసుకొని మధ్యవర్తికి ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. తమకు ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు. కాగా ఈ తరహా మోసాలు మార్టూరులో తరచూ జరుగుతున్నాయి.

క్లుప్తంగా

నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన ఎస్సై హరిబాబు

నాగులుప్పలపాడు: మండల పోలీసు స్టేషన్ నూతన ఎస్సైగా ఉయ్యాల హరిబాబు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పని చేస్తున్న ప్రభాకర్‌రెడ్డి అనారోగ్యం కారణంగా దీర్ఘకాలిక సెలవుపై వెళ్లడంతో ఎస్పీ మల్లికా గర్గ్ నాగులుప్పలపాడు పోలీసు స్టేషన్‌కు కొత్త ఎస్సైగా హరిబాబును నియమించారు. గురువారం ఉదయం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించిన ఎస్సై హరిబాబు సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి మండల పరిస్థితులు అడిగి తెలుసుకున్నారు. గతంలో ఇదే పోలీస్ స్టేషన్‌లో ఎస్సైగా విధులు నిర్వహించిన అనుభవం ఉండటంతో శాంతి భద్రతల విషయంలో రాజీ లేకుండా పనిచేస్తామని ఎస్సై తెలిపారు.

108 సమ్మెకు సీఐటీయూ సంఘీభావం

ఒంగోలు టౌన్: జనవరి 15 నుంచి 108 ఉద్యోగులు తలపెట్టిన సమ్మెకు సీఐటీయూ జిల్లా కమిటీ సంఘీభావం ప్రకటించింది. సమ్మెను విజయవంతం చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చింది. ఈమేరకు సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కాలం సుబ్బారావు, ఎం.రమేష్, గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 8గంటల డ్యూటీ అమలు చేయాలని, అదనపు పనికి ఓటీ చెల్లించాలన్నారు. ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, విధుల్లో ఉన్న వారికి వసతి సౌకర్యాన్ని కల్పించాలని కోరారు.

పొగాకు రైతులకు అవగాహన

కొనకనమిట్ల: పొగాకు సాగు చేసే రైతులు మెళకువలు పాటించి నాణ్యమైన పంటను పండించాలని పొదిలి వేలం నిర్వహణాధికారి జి.గిరిరాజకుమార్, ఐటీసీ మేనేజర్ వెంకటేష్ అన్నారు. మండలంలోని సిద్ధవరంలో గురవారం పొగాకు రైతులకు పొగాకు సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. పొగ తోటలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. పొగాకు తోటలో తల తుంచి పిలక మందు వాడితే ఉపయోగం ఉంటుందన్నారు. ఆకు రెలుపులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, క్యూరింగ్‌లో మెళకువలు, క్యూరింగ్, మండె వేసే విధానం, గ్రేడింగ్ వంటి విషయాలపై అవగాహన కల్పించారు. తుఫాన్ కారణంగా పంట దెబ్బతిన్న రైతులకు రైతు సంక్షేమ నిధి నుంచి రూ.10 వేలు వడ్డీ లేని రుణం అందిస్తామని గిరిరాజకుమార్ తెలిపారు. ఎఫ్‌ఓ ఖాసీం, అరుణ, రహమత్‌బాష పాల్గొన్నారు.

గోదాదేవికి నీరాటోత్సవం

మార్కాపురం టౌన్: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా గురువారం పట్టణంలోని కంభం రోడ్డులో ఉన్న శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో 27వ పాశురం చదివి గోదాదేవి అమ్మవారికి నీరాటోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పాలు, పెరుగు, తేనె, యాపిల్ జ్యూస్, కొబ్బరి నీటితో అభిషేకాలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. అమ్మవారిని అర్చకులు అరుణ్‌కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ రావిపాటి రామారావు, ఉపాధ్యక్షులు ఎస్.రమేష్, ఆండాళ్ గోష్టి సభ్యులు నాగదివ్య, సరిత, సుందరి పాల్గొన్నారు.

ఎరువులు ఇష్టం వచ్చినట్లు వాడొద్దు

దర్శి: రైతులు సాగు చేస్తున్న పంటలకు విచక్షణా రహితంగా ఎరువులు, పురుగుమందులు వాడి నష్టపోవద్దని ఆత్మ, జిల్లా వనరుల కేంద్రం సమన్వయకర్త, ప్రాజెక్టు డైరెక్టర్ అన్నపూర్ణ సూచించారు. దర్శి మండలంలో కంది, పత్తి, వరి, మొక్కజొన్న, శనగ, పొగాకు, మిరప పంటలు సాగు చేస్తున్న రైతులకు స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో గురువారం పూర్తిస్థాయి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సేంద్రియ, జీవన ఎరువుల వాడకాన్ని, పచ్చిరొట్ట పైరుల పెంపకాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. పత్తిలో యాజమాన్య పద్ధతులను ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ ఎస్‌వీపీఎస్ దుర్గాప్రసాద్ వివరించారు.

ఘనంగా ముందస్తు సంక్రాంతి సంబరాలు



సంక్రాంతి సంబరల్లో పాల్గొన్న పేస్ యాజమాన్యం, విద్యార్థులు



నారాయణ ఇంగ్లిష్ పాఠశాలలో సంక్రాంతి సంబరాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఒంగోలు/ఒంగోలు టౌన్: సంక్రాంతి సంబురాలు అంబరాన్నంటుతున్నాయి. స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్‌తోపాటు ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు అందరూ సంప్రదాయ దుస్తులు ధరించి ప్రత్యేక శోభను తీసుకువచ్చారు. భోగి మంటలు వేసి రంగవల్లులతో ఆవరణం అంతా సుందరంగా తీర్చిదిద్దారు. ఈసందర్భంగా కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ తెలుగు ప్రజలు జరుపుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవంతో పాటు భావితరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జీవీకే మూర్తి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ ఆర్.వీరాంజనేయులు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ఎం.రమణబాబు, ఈవెంట్ ఆర్గనైజర్ డీన్ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ కె.రూప తదితరులు పాల్గొన్నారు. నగరంలోని ధారావారితోటలోని నారాయణ ఇంగ్లిష్ స్కూలులో సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. సంబరాల్లో భాగంగా చిన్నారులకు భోగి పళ్లు పోసి ఆశీర్వదించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వేదవతి సంక్రాంతి పండుగ విశిష్టతను వివరించారు.

16 పార్కుల్లో సుందరీకరణ



గద్దలగుంట పార్కును పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు



మహిళతో మాట్లాడుతున్న కమిషనర్

- నగర కమిషనర్ వెంకటేశ్వరరావు

ఒంగోలు సబర్బన్: ఒంగోలు నగరంలోని పార్కుల అభివృద్ధి కోసం రూ.2.50 కోట్లు వెచ్చిస్తున్నామని నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన నగరంలోని పలు పార్కుల్లో కమిషనర్ గురువారం పర్యటించారు. సీఆర్‌పీ క్వార్టర్స్, గద్దలగుంటలోని పార్కుల్లో ప్రత్యేకంగా పర్యటించిన కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని 16 పార్కులను సుందరీకస్తున్నామన్నారు. సీఆర్‌పీ కార్టర్స్‌లోని పార్కును రూ.25 లక్షలు వెచ్చించి ఆధునీకకరించామన్నారు.

సీఆర్‌పీ క్వార్టర్స్ పార్కులో వ్యాయామ కోసం కొత్త వ్యాయామ పరికరాలను, వాకింగ్ ట్రాక్, చిన్న పిల్లల కోసం క్రీడా పరికరాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అదేవిధంగా నగరంలో ముంగమూరు రోడ్డు జంక్షన్ నుంచి నార్త్ బైపాస్ ఫ్లై ఓవర్ వరకు సుమారు రూ.30 లక్షలతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్-2 వెలనాటి మాధవ రావు, కార్పొరేటర్ తాడి కృష్ణలత, 21వ డివిజన్ కార్పొరేటర్ యనమల నాగరాజుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

వార్డులో పర్యటించిన కమిషనర్..

నగరంలో కమిషనర్ పలు డివిజన్లలో పర్యటించి వార్డు సచివాలయ సిబ్బందితో ముఖాముఖి సమీక్షలు నిర్వహించారు. ఆయా వార్డుల్లో ప్రజలకు చేస్తున్న సేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. 50వ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, మిలటరీ కాలనీ, బలరాం కాలనీల్లో పర్యటించి పారిశుధ్యంపై సిబ్బందితో సమీక్షించారు. కాలనీలో నిధులు మంజూరై మొదలు పెట్టని డ్రైనేజీ పనుల గురించి అడిగి తెలుసుకన్నారు. కార్యక్రమంలో ఎంఈ కే.మాల్యాద్రి, కార్పొరేటర్లు గండు ధనలక్ష్మి, అంబటి ప్రసాద్, అధికారులు ఉన్నారు.

నగర పరిధిలోని చెరువుకొమ్ముపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఒంగోలు నగర కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు గురువారం పరిశీలించారు. ప్రతి రోజు ఇస్తున్న మెనూ గురించి కార్యకర్తను అడిగి తెలుసుకుని సూచనలందించారు.

తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

చీమకుర్తి: రైతులు సాగు చేసే పంటల్లో తక్కువ పెట్టుబడి పెట్టి ఎక్కువ దిగుబడి సాధించాలని మండల వ్యవసాయాధికారిణి పీ.పావని రైతులకు తెలిపారు. గురువారం పేర్నమిట్టలోని రైతు భరోసా కేంద్రాలు-1, 2 పరిధిలో స్థానిక రైతులు సాగు చేసిన శనగ పంటలోని మెలకువలు వివరించారు. శనగ పంటలకు ఆశించే తెగుళ్ల నివారణకు తీసుకోవాల్సిన చర్యల గురించి అవగాహన కల్పించారు. ప్రతి రైతు తమ పరిధిలోనున్న రైతు భరోసా కేంద్రాలలోని వ్యవసాయ సహాయకుల ద్వారా సాగు చేసే పంటలను ఈ-క్రాప్‌లో నమోదు చేసుకోవాలన్నారు. దాని వలన పంటలు నష్టపోతే ప్రభుత్వం నుంచి అందించే పరిహారం, పంట రుణాలు, సున్నా వడ్డీ వంట పథకాలు పొందుటకు ఈ-క్రాప్ నమోదు దోహదపడుతుందని ఏవో సూచించారు. కార్యక్రమంలో ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

హెల్పర్లకు పదోన్నతులు ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న అన్నపూర్ణ

ఒంగోలు టౌన్: అర్హత కలిగిన హెల్పర్లకు వెంటనే పదోన్నతులు కల్పించాలని అంగన్‌వాడీ హెల్పర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఈదర అన్నపూర్ణ డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో జరిగిన యూనియన్ సమావేశంలో ఆమె మాట్లాడారు. అర్హులకు ప్రమోషన్లు ఇవ్వాలని న్యాయస్థానం తీర్పు ఇచ్చిందని తెలిపారు. అలాగే బదిలీలకు అర్హత ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలకు బదిలీలు చేయాలని కోరారు. పదోన్నతులు, బదిలీల మీద రాజకీయ ఒత్తిడీలు చేయడం సరికాదని జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.రమేశ్ చెప్పారు. అనంతరం పీడీని కలిసి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో సామ్రాజ్యం, గోవిందమ్మ, నరసకుమారి తదితరులు పాల్గొన్నారు.

మెలకువలు పాటిస్తే అధిక పాల ఉత్పత్తి సాధ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జేడీ బేబిరాణి

నాగులుప్పలపాడు: మేలైన యాజమాన్య పద్ధతుల ద్వారా రైతులు అధిక ఆదాయంతో పాటు పరిశుభ్రమైన పాల దిగుబడిని పొందవచ్చని పశు సంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ బేబిరాణి తెలిపారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొత్తకోట గ్రామంలో రైతులకు అవగాహన కార్యాక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేడీ రైతులతో మాట్లాడుతూ ప్రతి పశుపోషకుడు ఏడాదికి ఒక దూడ వంటి నిర్దేశంతో పశువులను పోషించడంతో పాటు వాటి ఆరోగ్య పరిస్థితులు చూడాలన్నారు. అనంతరం ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. అనంతరం సబ్సిడీపై రైతులకు మిశ్రమ దాణా అందించారు. కార్యక్రమంలో ఒంగోలు డివిజన్ ఉప సంచాలకులు డాక్టర్ కాలేషా, పశువైద్యులు డాక్టర్ జాస్మిన్, సహాయకులు మహేష్ తదితరులు ఉన్నారు.

ఇన్‌స్పైర్ అవార్డుకు ఉప్పలపాడు విద్యార్థి ఎంపిక

పొదిలి రూరల్: పొదిలి మండలం ఉప్పలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థి ఎం.రామ్‌చరణ్ జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ అవార్డుకు ఎంపికైనట్లు హెచ్‌ఎం వై.వెంకట్రావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 16 మండలాల నుంచి విద్యార్థులు పోటీ పడగా భౌతిక శాస్త్రంలో రామ్‌చరణ్ తయారు చేసిన కర్మాగారాల నుంచి కాలుష్యపు నీరును మంచినీరుగా మార్చే ప్రక్రియ ప్రాజెక్టు జిల్లా స్థాయిలో ఉత్తమ ప్రాజెక్టుగా ఎంపికైందన్నారు. రామ్‌చరణ్‌ను హెచ్‌ఎం వెంకట్రావు, ఉపాధ్యాయుడు ఎస్‌కే చాన్‌బాషా అభినందించారు.

న్యాయం జరిగితేనే హైవే నిర్మాణానికి సహకారం

తాళ్లూరు: గ్రీన్ ఫీల్డ్ హైవే ఏర్పాటులో భూములు కోల్పోతున్న రైతులకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగితేనే హైవే నిర్మాణానికి సహకరిస్తామని రెవెన్యూ అధికారులకు రైతులు స్పష్టం చేశారు. తాళ్లూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం హైవేలో భూములు కోల్పోతున్న రైతులకు గ్రామ సభ నిర్వహించారు. ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ మారం వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ ఇడమకంటి వెంకటేశ్వరరెడ్డిలు మాట్లాడుతూ గతంలో ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారం విషయమై ఎమ్మెల్యే డాక్టర్ మద్దిశెట్టి వేణుగోపాల్ కలెక్టర్‌తో చర్చించి రూ.12 లక్షల వరకు పెంచినట్లు తెలిపారు. మరో 11 శాతం వరకు కేంద్ర ప్రభుత్వం పెంచవచ్చన్న విషయాన్ని రైతులు సభ దృష్టికి తెచ్చారు. దీంతో పాటు బోర్లకు, పైప్‌లైన్స్, ఉద్యాన పంటలు కోల్పోతున్న పలువురు పేర్లు జాబితాలో లేవని, వాటిని కూడా సవరించి పూర్తి స్థాయిలో న్యాయం చేయాలని కోరారు. తమకు పూర్తి స్థాయిలో న్యాయం జరిగే వరకు సహకరించేది లేదని రైతులు సభ నుంచి వెళ్లిపోయారు.



తెలుగుతల్లి విగ్రహం వద్ద మాట్లాడుతున్న కవులు

తెలుగు భాషను కాపాడుకుంటేనే మనుగడ

ఒంగోలు: మనందరం కలిసి తెలుగు భాషను కాపాడుకోవాలని డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు అన్నారు. స్థానిక గాంధీపార్కు వద్ద, మాంటిస్సోరి స్కూలు పాఠశాలకు ఆనుకుని ఉన్న స్థలంలో తెలుగుతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజంలో తెలుగుభాషకు మరింత గుర్తింపు తీసుకురావాలనేదే తన ఆశయం అన్నారు. అందులో భాగంగానే ఇప్పటికే ఇదే ప్రదేశంలో తెలుగు భాషకు ప్రత్యేక ఖ్యాతి తీసుకువచ్చిన శ్రీకృష్ణదేవరాయలు, పదకవితా పితామహుడు అన్నమాచార్య విగ్రహాలను ప్రతిష్ఠించామన్నారు. కృతులతో తెలుగు భాషకు వన్నె తెచ్చిన త్యాగరాజస్వామి విగ్రహాన్ని స్థానిక ప్రసన్న చెన్నకేశవస్వామి ఆలయం వద్ద ప్రతిష్ఠించగలిగానన్నారు. మరికొద్ది రోజుల్లోనే ఈవిగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి వైఎస్సార్ సీపీ రీజినల్ కోఆర్డినేటర్, ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డితోపాటు ప్రముఖులను ఆహ్వానించి ఆవిష్కరణ కార్యక్రమం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు పొన్నూరి వెంకట శ్రీనివాసులు, శ్రీకృష్ణదేవరాయ సాహిత్య సాంస్కృతిక సంస్థ అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు, బీసీ సంఘం రాష్ట్ర కార్యదర్శి మద్దులూరి శ్రీనివాసులు, మిడసల మల్లికార్జున, నూనె అంకమ్మరావు, యువీ రత్నం, గుంటూరు సత్యన్నారాయణ, శింగమశెట్టి శివరామకృష్ణ, రావు చంద్రయ్య, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత శబరీనాథ్, దాసరి నారాయణరావు, లయన్ డీవీ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ ట్యూమర్ బాధితుడికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న శ్రీహరి

ఒంగోలు: బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న పేద బ్రాహ్మణుడికి శివం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు గొల్లపూడి శ్రీహరి రూ.50 వేలు అందించారు. గురువారం స్థానిక వీఐపీ రోడ్డులోని నాలుగో లైనులో ముక్తినూతలపాటి చలపతి మూర్తి, అనసూయలు నివాసం ఉంటున్నారు. వారి ఏకై క కుమారుడు వరుణ్‌కుమార్ డిగ్రీ వరకు చదువుకున్నాడు. తరుచూ తలనొప్పి వస్తుంటే వైద్యులు పరీక్షించి బ్రెయిన్ ట్యూమర్‌గా తేల్చారు. దీంతో వారు వైద్యం కోసం తమకు ఉన్న సొంత ఇంటిని సైతం అమ్మి అద్దె ఇంట్లో ఉంటూ వైద్యం చేయిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంలో ఈ జబ్బుకు అవకాశం లేదంటూ దంపతులు శివం ఫౌండేషన్‌ను ఆశ్రయించారు. కార్యక్రమంలో ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

త్రైమాసిక పన్ను రద్దు చేయాలి

ఒంగోలు టౌన్: రవాణా రంగంపై 30 శాతానికి పెంచిన రోడ్ టాక్స్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు దాసరి రమేష్, గంటినపల్లి శ్రీనివాసులు గురువారం ఒక ప్రటకనలో విజ్ఞప్తి చేశారు. కరోనా అనంతరకాలంలో పెరిగిన పెట్రోలు, డీజిల్ ధరలు పెరిగి రవాణా రంగం తీవ్ర సంక్షోభంలో పడిపోయిందన్నారు. జనవరి 13న లారీ స్టాండులు, డీటీసీ కార్యాలయాలు, కలెక్టరేట్ల వద్ద నిరసన కార్యక్రమాలను చేపట్టాలని, సంబంధిత అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని చెప్పారు.

గడప గడప కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి



పార్టీ నాయకులతో చర్చిస్తున్న ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు

చీమకుర్తి: గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు విజ్ఞప్తి చేశారు. గురువారం ఒంగోలులోని ఎమ్మెల్యే కార్యాలయంలో నాగులుప్పలపాడు మండల వైఎస్సార్ సీపీ నాయకులతో సమావేశమయ్యారు. ఈనెలలో 23, 24 తేదీలతో పాటు 29 నుంచి వచ్చే నెల 1వ తేదీ వరకు నాగులుప్పలపాడు మండలంలోని పలు సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని మరో విడత నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామాల్లోని నాయకులు ప్రభుత్వ పథకాలను ప్రజలలోకి తీసుకెళ్లేందుకు నిర్వహిస్తున్న కార్యక్రమంలో చురుకుగా పాల్గొనాలని తెలిపారు.

అపూర్వంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కేక్ కట్ చేస్తున్న పూర్వ విద్యార్థులు

నాగులుప్పలపాడు: నిడమానూరు కూనం రామిరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం చాలా అట్టహాసంగా జరిగింది. 1980-81 ఏడాదిలో పాఠశాలలో 10వ తరగతి చదివిన అప్పటి విద్యార్థులంతా కలిసి గురువారం గెట్ టు గెదర్ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అప్పటి జ్ఞాపకాలు నెమరేసుకొని వారికి విద్యా బుద్ధులు చెప్పిన ఉపాధ్యాయులు వెంకట్రామిరెడ్డి, ఆదం షరీఫ్‌లను ఘనంగా సత్కరించారు. తాము చదివిన పాఠశాల అభివృద్ధికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని వారు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ఈదర దేవసేన, అధ్యపకులు ఉన్నారు.

సచివాలయం తనిఖీ

పుల్లలచెరువు: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజలకు జవాబుదారీగా ఉంటూ సమయపాలన పాటించాలని తహసీల్దార్ దాసు అన్నారు. గురువారం మండలంలోని పిడికిటివానిపల్లి సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కార్యాలయంలో పలు రికార్డులు, ఉద్యోగుల హాజరు పట్టీని పరిశీలించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఉద్యోగులు తప్పనిసరిగా బయోమెట్రిక్ హాజరు వేయాలని చెప్పారు. వలంటీర్ల సహకారంతో గ్రామంలో అర్హులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

నిత్యాన్నదానానికి దాతల విరాళం

పెద్దారవీడు: మండలంలోని దేవరాజుగట్టు సమీపంలో వెలసిన శ్రీ కాశినాయన ఆశ్రమంలో రోజూ 50 మంది నిరుపేదలకు అన్నదానం చేసేందుకు రూ.5 వేల విరాళం మార్కాపురానికి చెందిన విశ్రాంతి ప్రిన్సిపాల్ ముతకపల్లి రామిరెడ్డి, ఆశ్రమం కోశాధికారి సనిశెట్టి ఆదినారాయణలు ఆశ్రమం కమిటీ సభ్యులకు గురువారం అందజేశారు. రామిరెడ్డి జన్మదినం సందర్భంగా 50 మందికి అన్నదానం చేశారు. అనంతరం రామిరెడ్డి దంపతులను ఘనంగా సన్మానించారు. ఆశ్రమం చైర్మన్ గుంటక సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఇళ్లకు వెళ్లి రేషన్ ఇవ్వాలి

పుల్లలచెరువు: ప్రతి ఎండీఎం ఆపరేటర్ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి రేషన్ అందజేయాలని తహసీల్దార్ దాసు సూచించారు. గురువారం మండలంలోని గంగవరం, పీవీపల్లి, పుల్లలచెరువు రేషన్ షాపులు, ఆపరేటర్ల వాహనాలను ఆయన తనిఖీ చేశారు. గ్రామాల్లో కొందరు రేషన్ ఇవ్వకుండా లబ్ధిరులకు నగదును ఇవ్వడంతో పాటు ఇళ్ల వద్దకు రాకుండా ఎక్కడో సెంటర్‌లో ఉంచి రేషన్ ఇస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ నిబంధనలు పాటించాలన్నారు.